క్లుప్తంగా

బాధితురాలికి నగదు పంపిణీ



బాధితురాలికి నగదు, బియ్యం అందిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని చింతవరం గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు కాలి పోయి నిరాశ్రయురాలైన ఓ బాధితురాలికి తహశీల్దార్ శ్రీనివాసులు చేతుల మీదుగా మంగళవారం రూ.5 వేల నగదు అందించారు. చింతవరం గ్రామంలోని బొలిగల కోటమ్మ ఇల్లు ఈ నెల 20న కాలి పోయింది. దీంతో ఆమె నిరాశ్రయురాలైంది. ఈ విషయంపై గ్రామ వీఆర్‌ఓ నివేదిక మేరకు ఆమెకు ఒక నెలకు సరిపడా బియ్యం, పప్పులు, రూ.5 వేల నగదును అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పేదలకు చెందిన పూరిల్లు తగలబడిపోతే ప్రభుత్వం వారిని ఆదుకుంటుందని, అందులో భాగంగానే ఆమెకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కండలేరులో 6.259 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.259 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 140, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

సూళ్లూరుపేట రూరల్: రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూళ్లూరుపేట వ్యవసాయ ఏడీఏ అనిత తెలిపారు. మంగళవారం కొత్తంబట్టు గ్రామంలో వ్యవసాయ పంట పొలాలను ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడగారు సీజన్‌లో ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 1010 రకం వరిసాగు చేస్తునట్లు గుర్తించారు. ప్రస్తుతం వరి పైరు చిరు పొట్ట, వెన్ను దశలో ఉందన్నారు. దీని ప్రకారం మందులు ఎలావాడాలో రైతులకు క్షుణ్ణంగా తెలిజేశారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తే అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంట చేతికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కవిత, గ్రామ సహాయకులు గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న రమేష్‌నాథ్

రాపూరు: ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సమన్వయ కర్త రమేష్‌నాథ్ పేర్కొన్నారు. రాపూరు ప్రభుత్వ వైద్యశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చిన రోగులకు వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. వైద్యశాలలో 12 మంది వైద్యులకు ఏడుగురు ఉన్నారని త్వరలో వైద్యులను నియమించేందుకు చర్యలు చేపడతామన్నారు. రోగులకు అందిస్తున్న భోజనం నాణ్యతతో ఉండాలని సూచించారు. కంటి, పంటి వైద్యులు ఉన్నా పరికరాలు లేవని ఆయన దృష్టికి తీసుకురావడంతో వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట వైద్యులు నర్మదాదేవి, సరస్వతి, రేష్మ, హరీష్, షాహీన, సగ్న, శ్రీనివాసరావు ఉన్నారు.


కుష్టు రహిత సమాజం కోసం కృషి



మందులు అందిస్తున్న సురేంద్రబాబు

రాపూరు: కుష్టు రహిత సమాజం ఏర్పాటుకు కృషి చేస్తామని జిల్లా కుష్టు న్యూక్లియస్ అధికారి సురేంద్రబాబు అన్నారు. రాపూరు మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం కుష్టు అనుమానితులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది ఇంటింటా కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే నిర్వహించి, గ్రామస్తులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రాపూరు తూర్పు అగ్రహారం కట్ట, వెలుగోడు గ్రామంలో ఇద్దరికి కుష్టు ఉన్నట్లు నిర్ధారించామన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?



చిల్లకూరు/సైదాపురం: అసెంబ్లీలో గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల సమస్యలపై సత్వర చర్చలు జరిగి వాటికి పరిష్కారం చూపేలా పని చేయాలని వివిధ వర్గాల ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజల ఆకాంక్షను అసెంబ్లీలో చర్చిస్తారా అనే ఆశలతో ఎదురు చూస్తున్నారు.

గూడూరులో ప్రధాన సమస్యలు

- ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రెండు పట్టణాలను కలిపే ఆర్‌ఓబీ బ్రిడ్జి నిర్మాణం
- గూడూరు పట్టణ ప్రజలకు దాహార్తిని తీర్చేలా రెండు పూటలా నీరు అందిస్తామన్న ప్రకటన మాటలకే పరిమితం కాకుండా నిధులు సాధించడం
- గూడూరులో ట్రాఫిక్ సమస్యలు
- రహదారుల నిర్మాణాలు......

చిల్లకూరు మండలంలో..

- ప్రధానంగా ధ్వంసమైన రహదారులకు కొత్త రూపు తీసుకురావడం.
- తీర ప్రాంతంలో పరిశ్రమలు, కోస్టల్ కారిడార్‌కు సేకరించిన భూములకు పూర్తి స్థాయి పరిహారం చెల్లింపు.
- తీర ప్రాంతంలో కండలేరు క్రీక్ వరద ప్రవాహంతో కోసుకు పోతన్న కట్టకు రివిట్‌మెంటు నిర్మాణం.
- భూ సేకరణ పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పరిశ్రమల నిర్మాణం.
- ప్రభుత్వ భూముల పరిరక్షణ.

కోట మండలంలో..

- కోట పట్టణంలో ప్రధానంగా రహదారి విస్తరణ పనులు
- కరకట్టలను పటిష్ట పరచడం.
- సాగునీటి చెరువులకు మరమ్మతులు
- ఎన్‌ఐటీ పనుల్లో పురోగతి

వాకాడు మండలంలో..

- వాకాడు మండల తీర ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధికి పూర్తిగా నిధుల మంజూరు
- వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్‌లో తెలుగు గంగ ద్వారా నీటి నిల్వ.
- వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్ ద్వారా అన్ని మండలాలకు తాగు, సాగు నీటిని అందించడం.

చిట్టమూరు మండలంలో..

- ప్రదానంగా బురదగాలి కొత్తపాళెం వద్ద రోడ్డు నిర్మాణం.
- ఉప్పు నీరుగా మారుతున్న తాగునీటి శుద్ధీకరణ
- పేదలకు భూ పంపిణీ



రోడ్లు వెడల్పు చేయాలి



మండల కేంద్రమైన కోటలో రోడ్లు ఆక్రమణలకు గురవడంతో రాకపోకలు సాగించేందుకు జనం ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఉన్న కోటకు నిత్యం జనం తాకిడి పెరిగింది. వాహనాలు పెరిగాయి. కానీ రోడ్లు మాత్రం ఆక్రమణలకు గురై కుంచించుకు పోయాయి. కోటక్రాస్‌రోడ్డు నుంచి కోట బజారువీధి మీదుగా కొక్కుపాడు రోడ్డు వరకు రెండు వైపులా ఆక్రమణలు తొలగించి రోడ్డు నిర్మాణం, డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలనేది ప్రజల ఆకాంక్ష.

– మధురెడ్డి, కోట

సాగు భూములకు పరిహారం అందించాలి



ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను చెన్నై బెంగళూరు కోస్టల్ కారిడార్‌కు సేకరించారు. వీటికి పరిహారం ఇవ్వకనే నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నారు. 2008లో సేకరించామని పరిహారం ఇవ్వనవసరం లేదని అంటున్నారు. ఇప్పటి వరకు తాము సాగు చేసుకుంటున్న భూమిని ఒక్క సారిగా తీసుకుంటే ఏం చేయాలి. వీటిపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని సుమారు 600 మంది పేద రైతులకు సహకారం అందించేలా వారి పక్షాన మాట్లాడాలి.

– కోటయ్య, తమ్మినపట్నం, చిల్లకూరు మండలం

కండలేరు క్రీక్ కట్టకు రివిట్‌మెంటు ఏర్పాటు చేయాలి



తీర ప్రాంతంలోని తమ్మినపట్నం వద్ద ఉన్న కట్ట వరద ప్రవాహం వచ్చిన ప్రతి సారి కోసుకు పోతోంది. దీని వల్ల తమ్మినపట్నంలోని సుమారు 400 కుటుంబాల వారు ప్రాణాలు అరచేతి పెట్టుకుని జీవనం చేయాల్సి వస్తుంది. దీనికి రివిట్‌మెంటు నిర్మించేలా సభలో మాట్లాడి విపత్తుల నిర్వహణ కింద నిధులు మంజూరు చేయించాలి.

– శ్రీనివాసులు, వరగలి, చిల్లకూరు మండలం

బ్యారేజ్ గేట్లు ఎత్తు పెంచాలి



వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్ గేట్లు ఎత్తు మరో 2 అడుగులు పెంచాలి. బ్యారేజ్ గేట్లు ఎత్తు పెంచే ప్రతిపాదనలు చేయాలి, ప్రతి సారి బ్యారేజ్‌కి వచ్చే వరద నీరు వృథాగా బంగాళాఖాతంలో చేరుతోంది. దీంతో ప్రతి ఏడాది చివరి తడికి నీరందక 25 వేల ఎకరాల ఆయకట్టు రైతులు సాగులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన బ్యారేజ్ గేట్లు ఎత్తు పెంచితే మరో 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అలాగే ప్రస్తుతం మరమ్మతులకు గురైన బ్యారేజ్ గేట్లు, రోప్‌లను వెంటనే బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– కుంభాల మస్తానయ్య, రైతు, వాకాడు

గంగ జలాలు విడుదల చేయాలి



వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్‌కి ప్రతి ఏడాది గంగ జలాలను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలి. బ్యారేజ్‌కి గంగ జలాలు విడుదల తాత్కాలికంగా కాకుండా శాశ్వత హక్కుగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుంటే చిన్న, సన్న కారు రైతులు ఏడాదికి రెండు పంటలు పండించుకుంటారు. ఏడాది పొడుగునా బ్యారేజ్‌లో సాగు, తాగునీరు ఉండేందుకు ఇసుక మేటలను తొలగించాలి. – కొట్లపూడి శ్రీనివాసులు, రైతు, కాశీపురం

స్టీమ్ బోట్లు దాడులను ఆపాలి



ఎంతో కాలంగా ఎదురవుతున్న పొరుగు రాష్ట్రాల స్టీమ్ బోట్లు దాడుల నుంచి స్థానిక మత్స్యకారులను కాపాడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి. వేట చేసుకునే ప్రాంతంలో నిబంధనలను ఉల్లంఘించి కడలూరుకు చెందిన స్టీమ్ బోట్లు వేట చేసుకుని మా జీవనానికి గండి కొడుతున్నారు. సాధారణంగా తీరం నుంచి 8 నాటికల్ మైళ్ల వరకు మేము వేట చేసుకుని జీవనం సాగిస్తున్నాం. అలాంటిది ఇతర రాష్ట్రాలకు చెందిన బోట్లు తీరం వరకు వచ్చి మత్స్య సంపదను దోచుకుపోవడంతోపాటు అడిగినందుకు మాపై దాడులు చేస్తున్నారు. దీనిపై శాశ్వత పరిష్కారం చూపేందుకు అసెంబ్లీలో ఎమ్మెల్యే తన వాణిని వినిపించాలి. – సోమయ్య, మత్స్యకారుడు, తూపిలిపాళెం



సాగు నీరు లేక ఎడారిని తలపిస్తున్న స్వర్ణముఖి బ్యారేజ్



నిబంధనలు ఉల్లంఘించి వేట సాగిస్తున్న పొరుగు రాష్ట్రాల స్టీమ్ బోట్లు

సమస్యలపై గళమెత్తండి

– వెంకటగిరి అభివృద్ధి కోసం కృషి చేయండి

సైదాపురం: వెంకటగిరి నియోజకవర్గంలో ఎన్నో అపరిష్కృత సమస్యలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పలు అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వానికి చెందిన వారే ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఈ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో ప్రగతిని పట్టాలెక్కించేందుకు చొరవచూపాల్సి ఉంది.

- తిప్పవరపాడు-వెంకటగిరి ప్రధాన రహదారి దారుణంగా మారడంతో వాహన చోదుకులు హడలిపోతున్నారు. వెంటనే నిధులను మంజూరు చేసి ఈరహదారిని మరింత అభివృద్ధి చేయాలి.
- చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలి. చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగించే వారి అభ్యున్నతికి ప్రత్యేక చొరవ చూపాలి.
- సైదాపురం-పొదలకూరు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.45 కోట్ల నిధులను మంజూరు చేసింది. అర్ధంతరంగా పనులను నిలిపివేయడంతో ఈ రహదారిపై ప్రయాణం ఒక నరకంగా మారింది. వెంటనే నిధులను విడుదల చేసి ఈ రోడ్డును బాగు చేయాలి.
- తెలుగుగంగ 2ఎ, 2బీ బ్రాంచ్ కెనాల్స్ అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయాలి.

పొదలకూరు రోడ్డును అభివృద్ధి చేయాలి



సైదాపురం–పొదలకూరు రోడ్డు 23 కిలోమీటర్లు రహదారి నిర్మాణ పనులు నిలిచి పోయాయి. కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో ఈ రహదారి మార్గంలో జోగిపల్లి, ఊటుకూరు, దాడిశెట్టిపల్లి, పొక్కందల, ఆదూరుపల్లి, గిద్దలూరు, తురిమెర్ల, కట్టుబడిపల్లి, దేవరవేమూరు, కలిచేడు, ఓరుపల్లి, తలుపూరు, మలిచేడు, పెరుమాళ్లపాడు, పరసారెడ్డిపల్లి గ్రామాలకు పోవాలంటేనే వాహనచోదకులు హడలిపోతున్నారు. గత ప్రభుత్వంలోనే రూ.45 కోట్ల నిధులు కూడా విడుదల చేశారు. కేవలం కలిచేడు వద్ద మాత్రమే సీసీ రోడ్డు మాత్రమే వేశారు. చిన్నపాటి వర్షం కురిసినా కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

– జి.శివకుమార్, సైదాపురం

సోమశిల-స్వర్ణముఖి కెనాల్‌ను పూర్తి చేయాలి



దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన సోమశిల-స్వర్ణముఖి లింక్ కాలువ పనులను వెంటనే పూర్తి చేసి రైతులను ఆదుకోవాలి. సోమశిల నుంచి వచ్చే నీటి ద్వారా గోనుపల్లి, రాపూరు పెద్ద చెరువులను రిజర్వాయర్ చేస్తే కొండ కింద ఉన్న గ్రామాల రైతుల పంట పొలాలు సస్య శ్యామలంగా మారుతాయి. ప్రజల తరపున ఎమ్మెల్యే అసెంబ్లీలో గళం వినిపించి నిలిచిపోయిన ఎస్ఎస్ కెనాల్ పనులను పునరుద్ధరించి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలి.

– మారంరెడ్డి రామ్‌మోహన్‌రెడ్డి, రాపూరు, రైతు

మర్లపూడికి సాగు నీరందించాలి



వెంకటగిరి నియోజకవర్గంలోని మర్లపూడిలో సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. గ్రామానికి ఎగువనే ఆరు కిలోమీటర్లు దూరంలోనే కండలేరు ప్రధాన కాలువ ఉంది. ఈ కాలువ ద్వారానే చెన్నైకు తాగునీరందిస్తున్నారు. కానీ మా గ్రామానికి అక్కడి నుంచి లిఫ్ట్ ఏర్పాటు చేసి సాగు నీరందించాలి. – వరదబండి ప్రభాకర్‌రెడ్డి, మర్లపూడి, సైదాపురం

కైవల్యాపై చెక్ డ్యాంలు నిర్మించాలి



సైదాపురం సమీపంలో ప్రవహిస్తున్న కైవల్యానది వద్ద పలు చోట్ల చెక్ డ్యాంలు నిర్మించాలి. సుమారు 10 పల్లెలకు సాగు నీరు అందే అవకాశం ఉంటుంది. గంగదేవిపల్లి వద్ద ఒక చెక్‌డ్యాం, సైదాపురం వద్ద మరో చెక్ డ్యాంను నిర్మిస్తే ఈ ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవు.

– బి.శివకుమార్, సైదాపురం

యాజమాన్య పద్ధతులు పాటించాలి





రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ, కృత్రిమ గర్భకోశ శిబిరం ప్రారంభిస్తున్న అధికారులు

ఓజిలి: పశుపోషణలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలను పొందవచ్చని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.ఉమామహేశ్వరి, పశు గణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణాధికారి టి.సోమయ్య అన్నారు. మండలంలోని మాచవరం గ్రామంలో ఉచిత గర్భకోశవ్యాధి చికిత్స శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, పశుపోషకులకు పశు పోషణ, పాడి పరిశ్రమపై అవగాహన కల్పించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలుజాతి పశువులను ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ఆరు వేల మేలు జాతి పెయ్యి దూడల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పాడి రైతులకు రాయితీతో కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యి దూడలను పొందవచ్చని తెలిపారు. పిండ మార్పిడి, ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ టెక్నాలజీలను రైతులకు వివరించారు. ఈ శిబిరంలో 50 పశువులను పరీక్షించి మందులను అందజేశారు. మేలుజాతి పశుగ్రాసం రకాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయసంచాలకులు పి.గోవర్ధన్‌రెడ్డి, పశువైద్యాధికారి బి.గౌతమ్, రెహమాన్, అసిస్టెంట్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో అవకతవకలు ఉపేక్షించం



మిట్టకండ్రిగలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్

నాయుడుపేట టౌన్: మండలంలో జరుగుతున్న ఉపాధి హామి పనులలో అవకతవకలకు పాల్పడితే ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఎవరినీ ఉపేక్షించేది ఉండదని ఎంపీడీఓ ఎ.ప్రేమ్‌రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పుదూరు పంచాయతీ మిట్టకండ్రిగ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ మంగళవారం పరిశీలించారు. వర్షాలు పడితే గ్రామ పరిధిలోని వరవ కాలువ సుమారు ఒక కిలో మీటరు పైగా పూడికతీతా పనులు చేపడుతామన్నారు. వర్షపు నీరు సాఫీగా చెరువులోకి చేరేందుకు రూ.5 లక్షల అంచనాలతో ఉపాధిహామీ పనులను 100 మందితో చేసున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.300 వేతనం చెల్లించే విధంగా పనులు చేస్తున్నట్లు వివరించారు.

వెలగని వీధిలైట్లు

దొరవారిసత్రం: జాతీయ రహదారి నుంచి మొదలై రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న గ్రామాల రోడ్లకు లక్షలు వెచ్చించి సోలార్ లైట్లు వేశారు. వీటి నిర్వహణ ఆయా పంచాయతీ పాలకులు చూసుకోవాల్సి ఉంది. అయితే ఎవరూ పట్టించుకోకపోవడంతో సోలార్ లైట్లకు రక్షణ లేకుండా పోయింది. లైట్లకు సంబంధించిన బ్యాటరీలు, సోలార్ ప్యానల్స్ దొంగల పాలయ్యాయి. ఈ విషయం తెలిసి కూడా రహదారి నిర్వాహకులు, పంచాయతీ పాలకులు కూడా పట్టించుకోకపోవడం గమనార్హం. తల్లంపాడు, కుప్పారెడ్డిపాళెం, మినమనముడి, అక్కరపాక, ఏకొల్లు, మేలుపాక గ్రామాల రోడ్లకు ఐరన్ పోల్స్ వేసి సోలార్ ప్యానల్స్, బ్యాటరీలు బిగించి లైట్లు వేశారు. ఒక్కో లైటు ఖర్చు రూ.20 వేలు నుంచి రూ.25 వేలు వరకు ఉంటుంది. ఒకటి రెండు గ్రామాల మార్గంలో తప్ప మిగిలిన గ్రామాల్లో ఎక్కడ ఒక్క లైట్ కూడా వెలగడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



అక్కరపాకలో వెలగని సోలార్ లైట్లు

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

వెంకటగిరి రూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించడంతో ప్రమాదం సంభవించిన సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని ప్యానల్ అడ్వొకేట్ గాంధీ పేర్కొన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి అనూష ఆదేశాల మేరకు హెల్మెట్ వినియోగంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలని, లేని పక్షంలో ప్రాణాలను కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. ఈ మేరకు రాష్ట్ర కోర్టు విరివిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గ్రామ దేవతకు ముడుపులు

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరులోని దళితవాడకు చెందిన గ్రామ దేవత సుందరమ్మకు మంగళవారం ముడుపులు కట్టారు. దళితవాడకు చెందిన మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. ముందుగా అమ్మవారికి నైవేద్యాలను సమర్పించేందుకు బోనాలను తీసుకుని గుడి ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆగస్టు నెల 9వ తేదీ నుంచి మూడు రోజులపాటుగా గ్రామ దేవత సుందరమ్మకు తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. అమ్మవారికి ముడుపులు కట్టే కార్యక్రమం నిర్వహించామని అన్నారు. తప్పెట్ల నడుమ యువత కేరింతలు, నృత్యాలతో అమ్మవారికి భక్తులు తెచ్చిన అంబలి పోసి చల్లబరిచారు.

గేదెను తప్పించబోయి..

- నడన్ బ్రేక్ వేసిన కారు డ్రైవర్
- వెనుక నుంచి ఢీకొట్టిన తమిళనాడు ఆర్టీసీ బస్సు



తమిళనాడు ఆర్టీసీ బస్సు వద్ద గుమికూడిన జనం

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలో రహదారిపై మంగళవారం కారును తమిళనాడు ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. స్థానికులు, పోలీసుల కథనం.. గుంటూరు ప్రాంతానికి చెందిన ఏవీ.రంగారావు తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలో దైవదర్శనం చేసుకునేందుకు కారులో వెళుతున్నారు. మార్గమధ్యంలో నాయుడుపేట పట్టణ పరిధిలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోకి వచ్చే సరికి ముందు గేదె అడ్డు రావడంతో కారును సడన్ బ్రేక్ వేసి నిలిపారు. అయితే వెనుక నుంచి వేగంగా వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కారును ఢీకొంది. దీంతో కారు వెనుక భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కారులో ఉన్న ఐదుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న వల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆషాడ మాసం సందర్భంగా మంగళవారం ఆలయం వద్ద ఉత్సవమూర్తులకు అభిషేకాలు జరిపి ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేద పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్ కృష్ణ శర్మ, దాతలు సుబ్రహ్మణ్యం, పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మూడు పర్యాయాలు సర్వే

చిల్లకూరు: చెన్నై– బెంగళూరు కోస్టల్ కారిడార్‌కు సేకరించే ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న వారికి అర్హత ఉంటే కచ్చితంగా పరిహారం అందించేలా చూస్తామని అందులో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని సాగుదారులకు అధికారులు సూచించారు. తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో మంగళవారం చిల్లకూరు, కోట తహశీల్దార్‌ల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లకూరు తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో 914 ఎకరాల ప్రభుత్వ భూమిని కోస్టల్ కారిడార్‌కు సేకరించామన్నారు. అయితే ఈ భూమిలో ఇప్పటికే 500 మంది వరకు సాగులో ఉన్నట్లు చెబుతున్నారని దీని వల్ల కోస్టల్ కారిడార్ పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. వీటిని సవ్యంగా చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మూడు పర్యాయాలు సర్వే పూర్తి చేసి అర్హులను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఇందులో భాగంగా 9 సర్వే బృందాలు ఉంటాయని, వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా చిల్లకూరు, కోట తహశీల్దార్‌లు ఉంటారని తెలిపారు. ఇద్దరు డీటీలు పని చేయడంతోపాటుగా రెండు మండలాల సర్వేయర్లు, డివిజనల్ సర్వేయర్ పర్యవేక్షిస్తారని తెలిపారు. అయితే సాగుదారులు మాత్రం తాము సాగు చేసే ప్రాంతంలోనే కొలతలు వేస్తే వెంటనే అందుకు సంబంధించిన వివరాలతో కూడిన పత్రాలు ఇవ్వాలని పట్టుబట్టారు. అయితే తహశీల్దార్ మాట్లాడుతూ అనుమానం ఉంటే రాత పూర్వకంగా ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తే మరో సారి సర్వే చేసి హక్కు ఉందా అనే విషయాలను గుర్తిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోట, చిల్లకూరు మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సాగుదారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసులు